క్లుప్తంగా

పౌష్టికాహారంతోనే చిన్నారుల ఎదుగుదల



యాదవ్ నగర్ అంగన్‌వాడీ కేంద్రం-2లో మాట్లాడుతున్న సీడీపీఓ పద్మావతి

ఏలూరు (టూటౌన్) : చిన్నారులకు ఎదుగుదలకు, మానసిక వికాసానికి పౌష్టికాహారం దోహదం చేస్తుందని సీడీపీఓ ఎ.పద్మావతి అన్నారు. స్థానిక యాదవ్ నగర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పౌష్టికాహార మాసోత్సవాల్లో భాగంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పద్మావతి మాట్లాడుతూ ఈ నెల ఒకటో తేదీ నుంచి 30వ తేదీ వరకు పౌష్టికాహార మాసోత్సవాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ బి.మంగ, అంగన్‌వాడీ కార్యకర్తలు టి.అరుణ,బి.శశికళ, సీహెచ్ నాగేశ్వరి, పలువురు తల్లులు పాల్గొన్నారు.

అప్పనవీడులో పశువైద్య శిబిరం



పశువుల మిక్చర్ ప్యాకెట్‌ను అందిస్తున్న పశుసంవర్ధక శాఖ జేడీ నెహ్రూబాబు

ఏలూరు (టూటౌన్) : పెదపాడు మండలం అప్పనవీడులో వరద ప్రభావిత గ్రామంలో పశువైద్య శిబిరం నిర్వహించినట్టు పశు సంవర్ధక శాఖ జేడీ డాక్టర్ జి.నెహ్రూబాబు తెలిపారు. ఈ శిబిరంలో పశు సంతానోత్పత్తి గురించి వివరించారు. ఈ శిబిరంలో 64 పశువులకు చికిత్స అందించారు. ఈ సందర్భంగా పశువులకు అవసరమైన మినరల్ మిక్చర్ ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ వాణీ సంధ్య, స్థానిక నాయకలు లావేటి శ్రీనివాస్, పలువురు రైతులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్స్‌కు చేయూత ఇవ్వండి

ఏలూరు (టూటౌన్): ప్రకృతి విలయ తాండవానికి విజయవాడ సింగ్‌నగర్ పూర్తిగా నీట మునిగిందని, ఆ ప్రాంతంలో ఎలక్ట్రికల్ వర్కర్స్ అధికంగా ఉన్నందున వారికి చేయూత ఇచ్చేందుకు ప్రతి ఒక్క ఎలక్ట్రికల్ వర్కర్ సహకరించాలని రాష్ట్ర ఎలక్ట్రికల్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ అధ్యక్షుడు లింగమల్లు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి బొజ్జ రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక ఇఫ్టూ జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వారు ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రాష్ట్ర యూనియన్ కోశాధికారి నాయుడు గంగాధరరావు, నాయకులు రాజ్ కుమార్, డాల్ఫిన్ నాగేశ్వరరావు, ఎం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు ప్రారంభం

ఏలూరు (టూటౌన్): బీజేపీ ఏలూరు జిల్లా సభ్యత్వ నమోదు కార్యక్రమం స్థానిక జిల్లా కార్యాలయంలో బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా పార్టీ రాష్ట్ర క్రమశిక్షణా సంఘం చైర్మన్ పాకా సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు సీహెచ్ విక్రమ్ కిషోర్, జిల్లా సభ్యత్వ ప్రముఖ్ శరణాల మాలతీరాణి, జిల్లా పార్ల మెంట్ కన్వీనర్ కట్నేని కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

ముందుచూపుతో తప్పిన ముప్పు

- వైఎస్సార్ సీపీ హయాంలో రూ.80 కోట్లతో రివిట్‌మెంట్
- ఏలూరుకు తప్పిన తమ్మిలేరు ముప్పు



తమ్మిలేరుకు గ్లేవియర్ నగర్ ఏటిగట్టు ప్రాంతంలో నిర్మించిన రివిట్‌మెంట్



హనుమాన్ నగర్ ప్రాంతంలో నిర్మించిన రివిట్‌మెంట్





పడమర లాకులకు వెళ్లే దారిలో సీఆర్‌ఆర్ కాలేజ్ వంతెన వద్ద ఏర్పాటు చేసిన రివిట్‌మెంట్, ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

ఏలూరు (టూటౌన్) : వైఎస్సార్ సీపీ హయాంలో తీసుకున్న ముందస్తు జాగ్రత్త చర్యలు వల్ల నేడు ఏలూరు నగరం ప్రశాంతంగా ఉందని స్థానికులు చెబుతున్నారు. తమ్మిలేరు వరద కారణంగా ప్రతి ఏటా ఏలూరు నగరానికి ప్రమాదం పొంచి ఉండటంతో నాటి ఎమ్మెల్యే ఆళ్ల నాని ఈ విషయాన్ని నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తమ్మిలేరుకు ఏలూరు పట్టణం పరిధిలో రివిట్‌మెంట్ నిర్మించాలని ప్రతిపాదనలు తయారు చేసి అమలు చేశారు. గత ఐదేళ్లలో రివిట్‌మెంట్ నిర్మాణానికి వైఎస్సార్ సీపీ హయాంలో విడదల వారీగా దాదాపు రూ.80 కోట్లు ఖర్చు చేసింది. తమ్మిలేరు ఏటిగట్టు వెంబడి రివిట్‌మెంట్ నిర్మించారు. ఇది వరద నీరు నగరంలోకి ప్రవేశించకుండా నగర వాసులను కాపాడిందని ప్రజలు గుర్తుచేసుకుంటున్నారు. గత పాలకుల చిత్తశుద్ధే నేడు ప్రజలకు మేలు చేసిందంటూ ఊపిరి పీల్చుకుంటున్నారు.

ప్రచారం చేసుకోని గత ప్రభుత్వం

తమ్మిలేరు ముంపు బారినుంచి ఏలూరు నగరాన్ని కాపాడిన నాటి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెద్ద మొత్తంలో తమ్మిలేరు రివిట్మ్మెంట్ నిర్మాణానికి ఖర్చు చేసినా.. ఎక్కడా దాని గురించి ప్రచారం ఆర్భాటం చేసుకోలేదు. నేటి కూటమి నాయకులు ఇసుక బస్తాలు వేస్తేనే ఫొటోలకు ఫోజులిస్తూ తెగ ప్రచార ఆర్భాటం చేస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చేసేది కొంత హడావుడి ఎక్కువ అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

జలాశయం గేట్లు ఎత్తితే ఏలూరు మునక

నాగిరెడ్డిగూడెం జలాశయం గేట్లు ఎత్తితే చాలు వరద నీరు ఏలూరు నగరంలోని పల్లపు ప్రాంతాలను ముంచెత్తేది. పల్లపు ప్రాంత ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం వారికి అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించడం వంటివి అధికార యంత్రాంగానికి పెద్ద సవాలుగా మారేది. కొద్దిపాటి వర్షం, వరదకే స్థానిక పోణంగి ప్రాంతంలోని వైఎస్సార్ కాలనీ నీట మునిగి పోయేది. సాధారణంగా నాగిరెడ్డిగూడెం జలాశయం నుంచి మూడు వేల క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేయగానే దాని ప్రభావం ఏలూరు నగరం, పరిసర ప్రాంతాలపై పడేది. స్థానిక అమీనాపేట నుంచి శనివారపుపేట వెళ్లే కాజ్‌వేపైకి మూడు అడుగుల మేరు వరద నీరు ప్రవహించేది. కాజ్‌వే సమస్య అలానే ఉన్నా.. నగరంలోని పల్లపు ప్రాంతాల ముంపు సమస్యను గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీర్చగలిగింది.



తంగెళ్లమూడి ప్రాంతంలో నిర్మించిన రివిట్‌మెంట్

ముంపు బాధలు తప్పాయి



ఏలూరు నగరానికి రెండు వైపులా ప్రవహించే తమ్మిలేరుకు గట్లు బలహీనంగా ఉన్నచోట్ల రివిట్‌మెంట్ నిర్మించడం వల్ల ముంపు బాధ తప్పింది. గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి ఏలూరు ప్రజల బాధలను తెలుసుకుని, దాని శాశ్వత నివారణకు చర్యలు తీసుకున్నారు. దీని వల్ల మేము ప్రస్తుతం ఊపిరి పీల్చుకోగలుగుతున్నాం. ఇవేమీ గుర్తులేని కొందరు నాయకులు వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గు చేటు.

– గారపాటి నాగేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకులు, ఏలూరు

తమ్మిలేరు సమస్యను తీర్చిన జగన్



ఏలూరు నగర వాసులు తమ్మిలేరు వరద ముంపు వల్ల పడే కష్టాలను తీర్చిన మహానుభావుడు గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి. ఎంతో మంది నాయకులను చూశాం. కానీ అడిగిన వెంటనే స్పందించి నిధులను కేటాయించి, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీనే. బుడమేరు పొంగి విజయవాడ కకావికలమైనట్టు, తమ్మిలేరు వరద వల్ల ఏలూరు నగర ప్రజలు అల్లాడాల్సి వచ్చేది.

– తంగెళ్ల రాము, కార్పొరేటర్, ఏలూరు నగరపాలక సంస్థ

చేలను వదలని వరద



కోటేశ్వరదుర్గాపురం వద్ద గట్టుపై రైతులు వేసిన ఇసుక మూటలు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ గ్రామాల్లో పంటచేలకు వరద ముంపు తప్పలేదు. బుధవారం సైతం తమ్మిలేరు నుంచి కొల్లేరుకు వరదనీరు ప్రవాహం కొనసాగడంతో చేల పక్క నుంచి వరదనీరు ప్రవహిస్తోంది. కొల్లేరులో నీరు వెనక్కి తన్ని చేలను మరింత ముంచేస్తోంది. మండలంలో రైతులు 6,500 ఎకరాల్లో వరి సాగు చేస్తున్న సంగతి తెలిసిందే. నేటికీ కోటేశ్వరదుర్గాపురం, చాటపర్రు, లింగారావుగూడెం, మాదేపల్లి, జాలిపూడి శివారున సుమారు 500 ఎకరాల వరి చేలల్లో మురుగునీరు కిందకు పారడం లేదు. సోమ, మంగళవారాల్లో రెవెన్యూ అధికారులు మురుగునీరు అడ్డంకిగా ఉన్న తూరలు, గట్లు తొలిగించినప్పటికీ చేలల్లో మురుగు వేగంగా కిందకు పారడం లేదని రైతులు వాపోతున్నారు. ఇప్పటికి రెండుసార్లు చేలను వరదనీరు ముంచిందని తెలిపారు. మూడోసారి చేలల్లో వరదనీరు చేరి ఐదు రోజులైందని అన్నారు. మరో రెండు రోజులు ఇదే పరిస్థితి కొనసాగితే నారుకు తెగళ్లు పట్టి చచ్చిపోతుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికే ఎకరానికి సుమారు 8 వేల వరకు పెట్టుబడి పెట్టామని వాపోయారు. ఎగువ ప్రాంతాల్లో ఉన్న మరి కొందరు రైతులు ఇసుక బస్తాలతో గట్లు పటిష్టపరుస్తున్నారు.



మల్కాపురంలో తాచుపాము శిల డ్రైయిన్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ జీవనసంధ్య

కొల్లేరు గ్రామాలకు తప్పని ముప్పు



కోమటిలంకలో వరదనీటిలో మునిగిన శ్మశానం

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలం కొల్లేరు పరివాహక గ్రామాల్లో వరద ముప్పు తప్పలేదు. బుధవారం సైతం ఎగువ నుంచి పెద్ద ఎత్తున వరదనీరు కొల్లేరుకు చేరుతోంది. ఫలితంగా కొల్లేరు ప్రజలు భయంతో కాలం గడుపుతున్నారు. గుడివాకలంక పరిసరాల్లో ప్రధాన రోడ్డుపై నుంచి నీరు ప్రవహిస్తోంది. లారీలు, కార్లు, ఆటోలు నిదానంగా ప్రయాణిస్తున్నాయి. ద్విచక్ర వాహనచోదకులు భయంభయంగా రాకపోకలు సాగిస్తున్నారు. గుడివాకలంక ఎస్సీకాలనీలో వరదనీరు ప్రవేశించింది. మాధవపురం వద్ద అటవీశాఖ అధికారులు నిర్మించిన పక్షుల విడిది కేంద్రం సైతం వరదలో మునిగిపోయింది. వాచ్‌టవర్ మాత్రమే దూరంగా కనిపిస్తోంది. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాలకు ప్రత్తికోళ్లలంక బీసీ కాలనీ, పైడిచింతపాడు జగనన్న కాలనీ చిత్తడిగా మారాయి.

ముంపులో శ్మశాన వాటికలు

కొల్లేరు గ్రామాల్లో శ్మశానవాటికలు ముంపుబారిన పడ్డాయి. గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక, పైడిచింతపాడు, కోమటిలంక, మొండికోడు తదితర గ్రామాల్లో శ్మశానవాటికలు వరదనీటిలో చిక్కుకున్నాయి. శ్మశానవాటికలకు వెళ్లే దారులన్నీ మోకాలి లోతున మునిగిపోయాయి. సమాధులు మాత్రమే కనిపిస్తున్నాయి. అంత్యక్రియలు నిర్వహించే అవకాశం లేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. అధికారులు కొల్లేరు గ్రామాల్లో పర్యటించలేదన్నారు.

వరద బాధితులకు ఆహార పొట్లాల తరలింపు



ఏలూరు(మెట్రో) : ఆహార పొట్లాల లారీని జెండా ఊపి పంపిస్తున్న దృశ్యం



ఏలూరు (టూటౌన్) : పారిశుద్ధ్య కార్మికుల లారీని ప్రారంభిస్తున్న మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతి



ఏలూరు (టూటౌన్) : బాధితులకు పాలు, బిస్కెట్లు పంపిణీ చేస్తున్న పెరికె వరప్రసాదరావు

ఏలూరు(మెట్రో) : వరద బాధితులకు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ ఆహార పొట్లాలు, వాటర్ ప్యాకెట్లను బుధవారం లారీలో విజయవాడ తరలించారు. స్థానిక స్టేడియం వద్ద ఉన్న మున్సిపల్ కాంప్లెక్స్ నుంచి లారీని ఏలూరు కమిషనర్ భాను ప్రతాప్ జెండా ఊపి ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పిలుపుమేరకు ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ సభ్యులు, ఉద్యోగులు తదితరులు విరాళాలు అందించారు. ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చోడగిరి శ్రీనివాస్, కార్యదర్శి నెరుసు రామారావు, కప్పల సత్యనారాయణ, జయరాజు, బేగ్, సత్యభారతి తదితరులు పాల్గొన్నారు.

విజవాడకు పారిశుద్ధ్య కార్మికులు

ఏలూరు (టూటౌన్) : ఏలూరు నగర పాలక సంస్థ నుంచి విజయవాడకు మరో 150 మందిని రెండో విడతగా బుధవారం తరలించారు. నగర పాలక సంస్థ కమిషనర్ ఎ.భానుప్రతాప్ ఆదేశాల మేరకు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ మాలతిరాణి ఆధ్వర్యంలో కార్మికులు బయలుదేరి వెళ్లారు. రెండో విడతలో 130 మంది పారిశుద్ధ్య కార్మికులు, మరో 20 మంది ఇన్‌స్పెక్టర్లు, మేస్త్రీలు, శానిటేషన్ సెక్రెటరీలు ఉన్నారు.

పాలు, బిస్కెట్లు పంపిణీ

విజయవాడ వరద బాధితులకు సెంట్ జాన్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ నాయకులు పెరికె వరప్రసాదరావు బుధవారం పాలు, బిస్కెట్లు, క్యాండిల్స్ పంపిణీ చేశారు. విజయవాడ సింగ్ నగర్, కండ్రిగలో భయంకరమైన పరిస్థితులు ఏర్పడ్డాయని పెరికె తెలిపారు. అనేకమంది నిరాశ్రయులయ్యారని, అనేక జీవాలు జలసమాధి అయిపోయాయని వాపోయారు. ఆపన్నులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలని పిలుపు నిచ్చారు. తక్షణమే వరద ప్రాంతాల్లో క్లీన్ అండ్ గ్రీన్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరద బాధితుల సహాయంలో ఉద్యోగులు, ఎన్డీఆర్‌ఎఫ్ బృందాల పనితీరు బాగుందన్నారు.

ఎస్ఎంఎస్ అంబులెన్స్ సర్వీస్ ఆధ్వర్యంలో..

ఐదువేల ఆహార పొట్లాలను, సర్వీస్ చేయడానికి రెండు అంబులెన్స్‌లను బుధవారం విజవాడకు పంపించారు. స్థానిక పవరుపేటలోని ఎమ్మెల్యే బడేటి చంటి క్యాంపు కార్యాలయం నుంచి ఎస్ఎంఎస్ అంబులెన్స్ సర్వీస్ అధినేత రఫీ, నల్లజర్ల మీరావలి ఆధ్వర్యంలో వీటిని తరలించారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, ఆవుపాడు మీరా, ఎస్‌కే బషీర్, మౌలాలి,ఎస్‌కె జావీద్, మాజీ డిప్యూటీ మేయర్ చోడే వెంకటరత్నం, కంప్యూటర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సత్యసాయి సేవా కేంద్రం ఆధ్వర్యం..

స్థానిక రామకృష్ణాపురంలో ఉన్న శ్రీ సత్యసాయి సేవా కేంద్రం వద్ద బుధవారం వాటర్ బాటిల్స్‌తో కూడిన రెండు మినీ వ్యాన్లను సంస్థ నాయకులు జెండా ఊపి విజయవాడకు తరలించారు. ఈ నెల 3న ఈ కేంద్ర ఏలూరు నుంచి 10 వేల మందికి బ్రెడ్, వాటర్ ప్యాకెట్లు అంజేశారు. కార్యక్రమంలో నరగపాలక సంస్థ కోఆప్షన్ సభ్యుడు పెదబాబు, శ్రీసత్యసాయి సేవా కేంద్రం నిర్వాహకులు కె.శశిశేఖర్, పైడేటి రామారావు, ఎస్ శాంత కుమార్, వెంకటేశ్వరరావు, కేఎల్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

జపాన్‌లో ఉద్యోగావకాశాలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కల్పన శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నావిస్ హెచ్ఆర్ వారిచే ఏఎన్ఎం, జీఎన్ఎమ్, బీఎస్సీ నర్సింగ్ చదువుకున్నవారికి జపాన్ కేర్ వర్కర్స్ ఇన్ హాస్పటల్స్, కేర్ హోం ఫెసిలిటీగా ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్టు ఏలూరు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జపనీస్ బాషలో పూర్తి రెసిడెన్షియల్ తరగతి విధానంలో బెంగళూరు కేంద్రంగా ఆరు నెలల శిక్షణ ఉంటుందని, 18 నుంచి 32 సంవత్సరాల మధ్య వయసు గల యువతీ యువకులు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ కోసం రిజిస్ట్రేషన్ ఫీజు రూ.50 వేలలో అభ్యర్థి రూ. 25 వేలు చెల్లిస్తే, స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ రూ.25 వేలు, ట్రైనింగ్ ఫీజు రూ.3 లక్షలు చెల్లించాలని వివరించారు. శిక్షణ సమయం ఆరు నెలలలో ఉచిత వసతి, భోజన సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి నెలకు రూ.1,10,000 నుంచి రూ.1,40,000 జీతం ఇస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్ 90302 27668 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



బాలుడ్ని తల్లిదండ్రులకు అప్పగించిన సీఐ కోటేశ్వరరావు, సిబ్బంది

ఏలూరు టౌన్ : ఏలూరు మినీబైపాస్ రోడ్డులో తప్పిపోయిన మూడేళ్ల బాలుడ్ని అర్ధగంటలోనే తల్లిదండ్రుల చెంతకు చేర్చారు ఏలూరు త్రీటౌన్ పోలీసులు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన పోసుపల్లి రాజు కుమారుడు చిన్నారి హర్ష ఆడుకుంటూ తన ఇంటి నుంచి తప్పిపోయాడు. మినీబైపాస్ రోడ్డులో బుధవారం ఉదయం 11.30 గంటల సమయంలో కనిపించటంతో కొందరు వ్యక్తులు త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావుకు సమాచారం ఇచ్చారు. వెంటనే ఆయన మహిళా కానిస్టేబుల్ సుజాతను పంపారు. బాలుడ్ని స్టేషన్‌కు తీసుకురావటంతోపాటు, తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చి వారికి బాలుడ్ని అప్పగించారు. బాలుడి తండ్రి రాజు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

వన్‌టౌన్‌లో చైన్‌స్నాచింగ్

ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తులు మోటారు సైకిల్‌పై వచ్చి మహిళ మెడలోని బంగారు గొలుసును లాక్కెళ్లారు. పడమరవీధికి చెందిన లక్ష్మీప్రసన్న అనే మహిళ తన కుమారుడ్ని స్కూల్లో దించి ఇంటికి వచ్చింది. గేటు తీస్తోన్న సమయంలో ఆకస్మికంగా మోటారు సైకిల్‌పై వచ్చిన దుండగులు ఆమె మెడలోని నాలుగు కాసుల బంగారు గొలుసును బలవంతంగా లాక్కెళ్లారు. బాధితుల ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రజకుల చెరువులను సర్వే చేయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న చిలకలపల్లి కట్లయ్య

ఏలూరు (టూటౌన్) : రజకులకు కేటాయించిన చెరువులు అన్యాక్రాంతం అవుతున్న తరుణంలో అధికారులు రజకుల వృత్తి చెరువులను సమగ్ర సర్వే చేయించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చిలకలపల్లి కట్లయ్య కోరారు. స్థానిక ఏటిగట్టులోని జిల్లా రజక సంఘం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రజకుల చెరువులు వరద నీటితో చెరువులు పొర్లుతున్నాయని, చేపలు కొట్టుకొని పోయి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కోరారు. పలు రజక వృత్తిదారుల చెరువులు ఆక్రమణలకు గురవుతున్నాయని, రజకుల వృత్తి చెరువులపై శాశ్వత హక్కులను కల్పించాలని అన్నారు. రాబోయే బడ్జెట్లో రాష్ట్రంలో ప్రతి జిల్లాకు దోబీ గాట్ల నిర్మాణానికి రూ.5 కోట్లు చొప్పున నిధులు కేటాయించాలని కోరారు. తాళ్లపూడి మండలం తిరుగుడు మెట్ట గ్రామంలో రజక సంఘం సభ్యులకు చెరువు లీజ్‌ను తగ్గించాలన్నారు. అనంతరం తిరుగుడు మెట్ట గ్రామ రజక జన సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పెదవేగి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడిగా డెంకాని పాపారావు, కార్యదర్శిగా పెదవేగి రత్నాజీ, సహాయ కార్యదర్శిగా పూల సత్యనారాయణ, కోశాధికారిగా పెదవేగి పోశయ్య, సభ్యులుగా పూల శివలింగం, కోళ్ల కృష్ణ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

జూదరుల అరెస్ట్

ఏలూరు టౌన్ : స్థానిక ఏలూరు నూకాలమ్మ గుడి సమీపంలోని ఒక ఇంట్లో నలుగురు మహిళలు, ఐదుగురు పురుషులు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో టూటౌన్ పోలీసులు దాడి చేశారు. తొమ్మిది మంది వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.13080 స్వాధీనం చేసుకున్నారు.

కొల్లేరు, మొండుకోడులో వరద ఉధృతి పరిశీలన

దెందులూరు: భారీ వర్షాలు, తుఫాను హెచ్చరికలతో గ్రామస్థాయి ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని దెందులూరు తహసీల్దార్ బి.సుమతి అన్నారు. బుధవారం పోతునూరులోని కొల్లేరు ప్రాంతాన్ని కొవ్వలిలోని మొండుకోడు వాగు, సత్యనారాయణపురం వద్ద జాతీయ రహదారి పక్కన ఉండే గుండేరు వాగు, దెందులూరు– సైఫన్ వద్ద గుండేరు వాగు ప్రవాహాన్ని తహసీల్దార్, ఆర్ఐ హేమమాలిని పరిశీలించారు. ఎటువంటి ప్రమాదం జరగకుండా దెందులూరు సైఫన్ వద్ద వీఆర్ఏలు, పోలీసు సిబ్బందిని నియమించారు. మండలంలోని నాలుగు ప్రాంతాల్లో భవిష్యత్ ఎటువంటి సంఘటనలు జరిగినా మండలాధికారులకు తెలియజేయాలని, ఇప్పటికే కంట్రోల్ రూమ్ నంబరును అందరికీ ఇచ్చామన్నారు.

మద్యం బాటిళ్లు స్వాధీనం

దెందులూరు: ప్రభుత్వ మద్యం షాపులో కొనుగోలు చేసి వాటిని అక్రమంగా అధిక ధరలకు అక్రమంగా విక్రయిస్తున్న తాతపూడి రాజేష్‌ను బుధవారం అదుపులోకి తీసుకున్నామని దెందులూరు ఎస్సై కె.స్వామి తెలిపారు. 180 మిల్లీమీటర్ల మద్యం బాటిళ్లు 40, 189 మిల్లీమీటర్లు మద్యం బాటిళ్లు 10 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. వాటి విలువ రూ.6,700 ఉంటుందని ఎస్సై వివరించారు.

వరద రక్షణ చర్యలపై డెమో





తమ్మిలేరులో ఎస్డీఆర్ఎఫ్ బృందం డెమో, ఏలూరులో ఎస్డీఆర్ఎఫ్ టీమ్ డెమోను తిలకిస్తోన్న జిల్లా ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: తుఫాన్ గండాలను గట్టెక్కేందుకు, తీవ్రమైన వరదలు సంభవిస్తే ముందస్తు రక్షణ చర్యలు చేపట్టా.. బాధితులను ఏ విధంగా కాపాడాలో స్టేట్ డిజాస్టర్ రెస్క్యూ ఫోర్స్ (ఎస్డీఆర్ఎఫ్) ఏలూరు తమ్మిలేరులో బుధవారం డెమో చేశారు. వరద ప్రవాహంలో ఎవరైనా చిక్కుకుంటే ప్రజల ప్రాణాలకు అపాయం లేకుండా రక్షించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టాలో ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ ఆధ్వర్యంలో ఎస్డీఆర్ఎఫ్ బృందాలు ముందుస్తు చర్యల ట్రయల్ నిర్వహించాయి. రోబో లైఫ్ బోటు వినియోగిస్తూ వరద ప్రవాహం నుంచి ఏలా రక్షిస్తారో చూపించారు. కార్యక్రమంలో టూటౌన్ సీఐ వైవీ రమణ, నగర ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, త్రీటౌన్ సీఐ కోటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.